క్లుప్తంగా

నేడు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కె.కోటపాడు : ఎ.కోడూరు, కె.కోటపాడు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ భాగ్యవతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని ఆమె సూచించారు.

అవురువాడలో జగన్ జన్మదిన వేడుకలు



అవురువాడలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బన్నీ తదితరులు

మాడుగుల రూరల్ : మండలంలో గిరిజన పంచాయతీ అయిన అవురువాడ గ్రామంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు తంటపురెడ్డి బన్నీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ సభ్యులు చదల కృష్ణందొర, మాజీ సర్పంచ్ కిముడు కోటి, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మోదమాంబ ఆలయానికి విరాళం



ఎం. కోడూరు మోదమాంబకు విరాళం అందజేస్తున్న రేణం శేషగిరి కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోడూరు మోదమాంబ ఆలయానికి స్థానికులు రేణం శేషగిరి లక్ష్మి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో రూ.15వేలు విరాళం ఆదివారం అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు ఈ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు శ్రీనివాసశాస్త్రి, నాయకులు పడాల అప్పలనాయుడు, సతీష్, హరిప్రసాదు, చిట్టిబాబు, మూర్తి, జగదీష్, అప్పలనర్సయ్య, అప్పలనాయుడు, జగదీష్ పాల్గొన్నారు.

కోలాటం మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు, సామగ్రి అందిస్తున్న గోవిందరావు, కిరణ్ తదితరులు

కె.కోటపాడు : మల్లంపాలెం గ్రామానికి చెందిన కోలాటం నిర్వహించే మహిళలకు గ్రామానికి చెందిన ఇద్దరు దాతలు చీరలు, కోలాటం సామగ్రిని వారి సొంత నగదుతో సమకూర్చారు. 20 మంది మహిళలకు ఏకరూపు చీరలను రూ.15వేలతో రొంగలి కిరణ్ అందించారు. అదే విధంగా రూ.5వేలతో వార్డుమెంబర్ వంటాకు గోవిందరావు కోలాటం సామగ్రిని వీరికి సమకూర్చి శనివారం రాత్రి గ్రామస్తుల సమక్షంలో అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొడ్డు దేముడుబాబు, జాగరపు కన్నంనాయుడు, కర్రి అప్పారావు, తోటపు చిరంజీవి పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గంతో సభ్యులు

చోడవరం రూరల్ : స్థానిక వాకర్స్ క్లబ్ వార్షిక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఇతర కార్యవర్గ సభ్యులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ సమక్షంలో గుప్తా, నవకుమార్, రమణ, కన్నంనాయుడు బలపరచడంతో ఏకగ్రీవం చేసుకున్నారు. క్లబ్ సభ్యులకు సోలార్ ట్రీ పవర్ సంస్థ టీ షర్ట్స్, వైభవ జ్యూవెలర్స్ జ్ఞాపికలను అందచేశారు. జి.రాంబాబు, పైడారావు, సూరిబాబు, ఎ.జగన్నాథరావు, కాశీరాజు, దేవానంద్, రాజశేఖర్, నెహ్రూ పాల్గొన్నారు.

పక్కాగా జీవాల లెక్క

- పశుగణన చేస్తున్న ఎన్యూమనేటర్‌లు
- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ
- 16 రకాల జీవాలపై సర్వే
- 145 గ్రామాల్లో 34,358 గృహాల్లో పూర్తి
- పాలు, మాంసం, ఉత్పత్తి వివరాల సేకరణ



చీడికాడలో పశు గణన నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు



సర్వే అనంతరం గేదెలను పశువుల పాకలకు చేర్చుతున్న దృశ్యం

మాడుగుల : కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పక్కాగా పశు లెక్క తేల్చడానికి నవంబరు 2024 ఒకటవ తేదీ నుండి ఫిబ్రవరి నెల వరకు సర్వే నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దీని ప్రకారమే ప్రస్తుతం సర్వే ప్రారంభించారు. ప్రస్తుతం మాడుగుల నియోజకవర్గంలో మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, మండలాల్లో 156 రెవెన్యూ గ్రామాల్లో 63,806 హౌస్ హోల్డ్ సంబంధించి సర్వే ప్రారంభించారు. గేదెలు, ఆవులు, మేకలు, ఇతర జంతుజీవులతో పాటు 16 రకాల జంతు జీవాలపై సర్వే జోరుగా జరుగుతుంది. నియోజకవర్గంలో శిక్షణ పొందిన 52 మంది ఎన్యూమరేటర్లు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. కేంద్రం ఆధీనంలో ప్రతి ఐదేళ్ళకోసారి ఈ సర్వే జరుగుతుంది. దీనిలో భాగంగాను 2024 నవంబరు నుంచి సర్వే ప్రారంభించారు. నియోజకవర్గంలో 63,806 గృహాలు సర్వే చేయవలసి ఉండగా నేటి వరకు 34,358 హౌస్‌హోల్డ్ లులో సర్వే జరిగింది.

పశుపోషకులకు మేలు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా సర్వే ప్రారంభించారు. ఈ సర్వేలో భాగంగానే పశువులు ఇతర జంతు జీవాలకు మందులు బడ్జెట్, మాంసం, పాలు. ఉత్పత్తి పెంపొందించడానికి ఈ సర్వే దోహద పడుతుంది. సర్వే చేసిన ఇళ్లకు స్టిక్కర్లు అంటించడంతో పాటు వారి శాఖ యాప్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో ఎన్యూమరేటర్లు సర్వే చేసిన గ్రామాల వివరాలు

మండలం	ఎన్యుమరేటర్లు	రెవెన్యూ గ్రామాలు	సర్వే గ్రామాలు
మాడుగుల	11	52	9800
చీడికాడ	9	32	6900
కె.కోటపాడు	15	32	8832
దేవరాపల్లి	17	40	8826

ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న ఈ సర్వేకు పశు పోషకులు, ఇతర పెంపుడు జంతు పోషకులు వారు గ్రామాల్లో సర్వే జరుపుతున్న ఎన్యూమరేటర్లకు సహకరించాలని పశువైద్యాధికారులు కోరుతున్నారు.

అన్నివిధాలా ఉపయోగం



శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. పెంపుడు జంతువుల వివరాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా పాలు, మాంసం, ఉత్పత్తి వివరాలు తెలుస్తాయి. పశువులకు అవసరమైన బడ్జెట్ అంచనా వేసుకోవడానికి కేంద్రం ప్రతి ఐదేళ్లకోసారి పక్కాగా ఈ సర్వే నిర్వహిస్తుంది. రైతులు, జంతుపెంపకం దారులు గ్రామాల్లో తిరిగే ఎన్యూమరేటర్లకు సహకరించాలి. – వి.చిట్టినాయుడు, పశువైద్య శాఖ ఏడీ, మాడుగుల

తుపాను వర్షాలకు వరికి తీవ్ర నష్టం



ఒమ్మలిలో తడిసిన వరి పనలను ఎత్తుతున్న రైతు



సాగరంలో తడిసిన వరి పంటను నూర్పు మిషన్‌లో నూర్పు చేస్తున్న రైతులు

- నీట మునిగిన వరి పనలు
- పంటను సంరక్షించుకోవడానికి రైతుల పాట్లు

మాడుగుల రూరల్ : రెమాల్ తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోసిన వరి పంట తడిసి పోయింది. మండలంలో సుమారు 80 శాతం మేర వరి కోతలు పూర్తి కాగా, మరో 20 శాతం వరి కోతలు కోయవలసి ఉంది. కోసిన పంట నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు తడిసి పోయింది. దీంతో వరి పనల్లో గింజ తడిసి మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. ఆదివారం నుంచి వాతావరణం కొంత మేర అనుకూలించడంతో పాటు ఎండ కాయడంతో రైతులు పంట పొలాల్లో గల వరి పనలను గట్టుపై చేర్చుతున్నారు. వరి పనలు మీద ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్నారు.కోసిన పంటను కళ్లం దిబ్బలు వద్ద నూర్పు మిషన్ల ద్వారా నూర్పు చేసే పనిలో రైతులు నిమగ్నులై ఉన్నారు. మండలంలో గడిచిన నాలుగు రోజులల్లో 46.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందని స్థానిక తహసీల్దార్ రమాదేవి తెలిపారు.



కె.జె.పురంలో తడిసిన వరి పనలను ఆరబెడుతున్న రైతు

మండల వ్యవసాయాధికారి సూచనలు

వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే, తడిసిన వరి పనలపై ఒక లీటరు నీటికి 50 గ్రాములు కల్లు ఉప్పు కలిపి పిచికారీ చేసినట్టయితే ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా, కాపాడుకోవచ్చునని స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవ రావు రైతులకు సూచించారు.

హెల్మెట్ ధరించకపోతే బైక్ సీజ్

చీడికాడ : బైక్ నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు గాయాలై మృత్యువాత పడుతున్నారన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందితే ఆ కుటుంబంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక టీములు రోడ్లుపై తనిఖీలు నిర్వహించి అవసరమైతే బైక్ సీజ్ చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా బైకు నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

రూ.7 కోట్ల సంక్రాంతి బోనస్ చెక్కు పంపిణీ



పాడి రైతులకు బోనస్ చెక్కు అందజేస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనందకుమార్, ఎమ్మెల్యే బండారు

మాడుగుల : విశాఖ డెయిరీ తరఫున చోడవరం యూనిట్ మాడుగుల, చీడికాడ, పాల కేంద్రాలకు సంబంధించి 6,128 మంది రైతులకు సంక్రాంతి బోనస్‌గా రూ.7,07,73,462 చెక్కును స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద కుమార్, డెయిరీ డైరెక్టర్ పిల్లా రమాకుమారి చేతుల మీదుగా రైతులకు ఆదివారం స్థానిక తులసీ కళ్యాణ మండపం వద్ద చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా డైయిరీ చైర్మన్ ఆనంద కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ పని చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో 2 లక్షల 15 వేల మంది రైతులకు రూ.59 కోట్ల 17లక్షల 1177 నగదుకి సంబంధించిన చెక్కును సంక్రాంతి బోనస్‌గా రైతులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు గేదెల సత్యనారాయణ, శీరం రెడ్డి సూర్యనారాయణ, మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, స్థానిక పాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాము శ్రీను, గండి జోగినాయుడు, పాడి రైతులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సంబరాలకు ముస్తాబైన చర్చిలు



విద్యుత్ లైటింగ్‌లో ఎల్‌బీ పురం చర్చి



బంగారుమెట్టలో చర్చి ఎదుట క్రిస్మస్ స్టార్



వేడుకలకు సిద్ధమైన బుచ్చెయ్యపేట చర్చి

బుచ్చెయ్యపేట : క్రిస్మస్ సంబరాలకు ఆయా గ్రామాల చర్చిలు ముస్తాబయ్యాయి. బుచ్చెయ్యపేట మండలంలో గల 35 పంచాయతీ గ్రామాల్లో డిసెంబర్ 25న జరిగే క్రిస్మస్ సంబరాలకు ఆయా గ్రామాల మత పెద్దలు చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయితీ వడ్డాదితో పాటు ఎల్‌బీ పురం, బంగారుమెట్ట, సీతయ్యపేట, దిబ్బిడి, మల్లాం, కరక, విజయరామరాజుపేట, తురకలపూడి, పీడీ పాలెం, శింగవరం, గున్నెంపూడి, పెదమదీన, రాజాం తదితర గ్రామాల్లో చర్చిలను మిరుమిట్లు గొలిపే విద్యుత్ లైటింగ్ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేశారు. చర్చిల ముందు పలువురు ఇళ్ల మీద క్రిస్మస్ స్టార్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలు చర్చిల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ సంబరాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో ఏసు ప్రభువుపై ఉన్న భక్తిని చాటేలా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆయా గ్రామాల్లో జరిగే ప్రత్యేక ప్రార్థనలు కోసం చర్చిల వద్ద తగిన ఏర్పాట్లు చేపట్టారు. అలాగే క్రిస్మస్ కేక్‌లు కటింగ్‌కి, అన్న సమారాధనలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు



చౌడువాడలో వేకువజాము సమయాల్లో మేలుకొలుపు కార్యక్రమం



సత్యవరం గ్రామ రామాలయంలో భజనల్లో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో వేకువజాము సమయాల్లో భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం పురస్కరించుకుని గ్రామంలో సతకంపట్టు రామాలయం వద్ద నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ నెల 16 నుంచి నెలగంట కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజు నుంచి భోగి పండగ వరకూ ప్రతి రోజూ ఉదయం 4 గంటల నుంచి రామాలయం నుంచి రాముని చిత్రపటంతో మేల్కొలుపు కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహిస్తున్నారు. భక్తి భావంతో జరిగే ఈ మేల్కొలుపు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు.

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మేలుకొలుపు ఉత్సవాలు నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో దీపారాధన నిర్వహించి అనంతరం రామాలయంలో ప్రత్యేక భజనలు నిర్వహించారు. నెల గంట ప్రారంభం నుంచి భోగి రోజు వరకు మేలుకొలుపులుతో పాటు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం అనాది కాలంగా వస్తుందని, నిర్వాహకులు బి.పాల్గున, జి.మాలతి, ఎం.సత్యవతి, జి.చిన్నమ్ములు చెబుతున్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం : సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. రెండు కొండల నడుమ నుంచి ప్రవహించే నీటిలో జలకాలాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి చేశారు. తాండవ అందాలను తిలకిస్తూ తాండవ ప్రాజెక్టు దిగువనున్న పార్కులో ఆట పాటలతో కాలక్షేపం చేశారు. సరుగుడు జలపాతం తాండవ రిజర్వాయరుకు వెళ్లే రోడ్డులో సందర్శకుల వాహనాలు రద్దీ అధికంగా ఉండడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంది.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

మాడుగుల రూరల్ : ధనుర్మాసోత్సవాలు ఆలయాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు వైష్ణవాలయం, రామాలయాల్లో ఉదయం, సాయంత్రం పూజలు, మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి పూజలు, భక్తులు గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ప్రతి శనివారం రాత్రి భజన కార్యక్రమం, చద్ది ఏర్పాటు చేస్తున్నారు. కె.జె.పురం రామాలయంలో ప్రతి రోజు రాత్రి భజన కార్యక్రమం, తెల్లవారుజామున భక్తులు ఆధ్వర్యంలో పురవీధుల్లో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం రాత్రి భజన కార్యక్రమం అనంతరం దాతల సహకారంతో భక్తులకు చద్ది ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో వి.వి.అగ్రహారం, పెంటయ్యపాలెం, పోతనపూడి, జి.అగ్రహారం, వీరనారాయణం, ఎం. కోటపాడు, చింతలూరు, గాదిరాయి, వంటర్లపాలెం, ముకుందపురం, తదితర గ్రామాల్లో గల రామాలయాల్లో ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.



కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి

జంగమ కుటుంబ సభ్యులంతా ఐక్యంగా ఉండాలి



గుల్లేపల్లిలో ఆత్మీయ కలయికలో పాల్గొన్న జంగమ సంక్షేమ సంఘం ప్రతినిధులు

గుల్లేపల్లిలో ఆత్మీయ కలయిక

కె.కోటపాడు : వెనుకబడిన వర్గాలుగా ఉన్న జంగమ కుటుంబాలు ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నవ్యాంధ్ర జంగమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగలింగం అన్నారు. గుల్లేపల్లి చెరుకు తూనికా కేంద్రం ప్రాంగణంలో ఆదివారం మండలంలో గల మల్లికార్జున జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంగమ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలింగం మాట్లాడుతూ జంగమ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాగంగా చదువుల్లో రాణిస్తున్న జంగమ కుటుంబ సభ్యుల విద్యార్థులకు ప్రోత్సాహక నగదును మల్లికార్జున జంగమ సంక్షేమ సంఘం కమిటీ అందించారు. కార్యక్రమంలో మండల జంగమ సంఘం అధ్యక్షుడు మురకాడ సత్యలింగం, గౌరవ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ, కార్యదర్శి జేగురపాటి రామపాపారావు, ఉపాధ్యాయుడు అప్పికొండ బసవరాజు, మురకాడ అర్జునరావు, అన్నదానపు సత్యనారాయణ, భీమేష్, నంది బాబూరావు, కొమ్మోజి శివాజీ, హరి పాల్గొన్నారు.

నూకినాయుడుకు ఘన నివాళులు

గొలుగొండ : బడుగు బలహీన ప్రజల కోసం నిత్యం పోరాటాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నూకినాయుడు ఉన్నాడని జిల్లా రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ తెలిపారు. లగుడు నూకినాయుడు 27 వర్ధంతి కార్యక్రమం మండలంలో కృష్ణదేవిపేట గ్రామంలో నిర్వహించారు. నూకినాయుడు విగ్రహానికి పలువురు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కరరావు, శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.

శ్రీను మృతి పార్టీకి తీరని లోటు

బుచ్చెయ్యపేట : ఎల్‌బీ పురం సర్పంచ్ తమరాన శ్రీను మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. అనారోగ్యంతో శ్రీను శనివారం సాయంత్రం మృతి చెందగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ మండల నాయకులతో కలిసి శ్రీను భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. మృతుడు శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న తనంలోనే శ్రీను మృతి చెందడం బాధాకరమన్నారు. శ్రీను కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు పలు గ్రామాలకు చెందిన ఆయా పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు ఎల్లపు విజయ్‌కుమార్, గోపిశెట్టి శ్రీను, తమరాన దాసు, శిరిగిరిశెట్టి నానాజీ, దొండా శ్రీను, యెనుముల వాసు, మేరుగు బాబూరావు, సాయం శేషు, దరిమిశెట్టి అప్పలనాయుడు, గుడాల ఆనంద్, గుద్దేటి శ్రీను తదితరులు శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.



శ్రీను భౌతికకాయం వద్ద నాయకులతో కలిసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్ : గణిత శాస్త్రంలో పలు ప్రయోగాల ద్వారా ప్రపంచ దేశాలకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు రామానుజన్ అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం రామానుజన్ 137వ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తో పాటు గణిత విభాగం హెడ్ కృష్ణారావు రామానుజన్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. రామానుజన్ పేదరికం నుంచి తనకు ఇష్టమైన గణిత శాస్త్రం ద్వారా ఉన్నత స్థానానికి ఎదిగారని ప్రిన్సిపాల్ అన్నారు. ఆయన జీవిత చరిత్ర ప్రతి విద్యార్థికి స్ఫూర్తి దాయకమని తెలిపారు. హెచ్‌ఓడీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గర్వపడే రీతిలో పలు సిద్ధాంతాలను కనుగొని రామానుజన్ ఎక్కువగా పేరెన్నికగన్న ఆయన ప్రతీ భారతీయునికి గర్వకారణమన్నారు. వివిధ విభాగాల హెచ్‌ఓడీలు రత్నభారతి, సుధీర్, వెంకటేష్, అప్పలనాయుడు, రాధాకృష్ణ సీనియర్ ఉపన్యాసకులు రఫీయుద్దీన్, మాల్యాద్రి, పిచ్చమ్మ, లక్ష్మీమంగమ్మ పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు



జగన్ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ

దేవరాపల్లి : మండలంలోని ఎ. కొత్తపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, సర్పంచ్ సత్య వెంకటరమణ మాజీ సిఎం జగన్ జన్మదిన కేక్‌ను కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. వైఎస్సార్ సీపీ నాయుకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.